## క్లుప్తంగా

### వేగవంతంగా బీసీ కాలనీ రోడ్డు పనులు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని ప్రధాన రహదారి, బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. సిం మెంటు రోడ్డు నిర్మాణానికి ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 35 లక్షలు స్థానిక ఎమ్మెల్యే టి.శ్రా వణ్‌కుమార్ కేటాయించినట్లు పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న శనివారం తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా సైడు కీవాల్స్ పనులు జరుగుతున్నాయని ట్యాంకు ద్వారా నీటితో కీవాల్సును తడుపుతున్నామన్నారు. సుమారు 400 మీటర్లు సిమెంటు రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. పనులను కె.రామకోటేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారన్నారు.

### మరుగుదొడ్ల వినియోగం తప్పనిసరి



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం -1 లోని మరుగుదొడ్లను ఎంపీడీవో వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బహిరంగ మల విసర్జనకు దూరంగా ఉండి మరుగు దొడ్లను వినియోగించుకోవాలని చెప్పారు. పిల్లలు కూడా మరుగుదొడ్లు వినియోగించడం వల్ల అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

### ఇంటి పన్ను సత్వరమే చెల్లించాలి

ఫిరంగిపురం: ఇంటి పన్ను బకాయిలు సత్వరమే చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని పంచాయతీ ఏవో ఏకేబాబు చెప్పారు. ఫిరంగిపురంలో 4, 500 గృహాలు ఉన్నాయని, వాటికి సంబంధించి ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు కోసం పంచాయతీ సిబ్బంది శనివారం ఇంటింటికి వెళ్లి డిమాండు నోటీసులు అందిస్తున్నట్లు తెలిపారు. ముగ్గురు చొప్పున ఒక బృందంగా మొత్తం నాలుగు బృందాలు ఈ డిమాండు నోటీసులు అందిస్తున్నారని చెప్పారు.

### నలుగురు పేకాట జూదరుల అరెస్ట్

తాడికొండ: పాములపాడు గ్రామంలోని పాత సొసైటీ భవనం వద్ద పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు. ఎస్ఐ జోజి, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో రూ.1,760 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### మహిళపై మాజీ భర్త చాకుతో దాడి



తెనాలిరూరల్: మహిళపై మాజీ భర్త చాకుతో దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలి వైకుంఠపురం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ వైకుంఠపురానికి చెందిన బుర్రి సంధ్యకు 12 ఏళ్ల క్రితం ఇదే ప్రాంతంలోని పోతురాజు కాలనీకి చెందిన దమ్ము సామేలుతో వివాహమైంది. మనస్పర్థల కారణంగా రెండేళ్ల నుంచి భర్తతో విడిపోయి ఉంటూ విడాకులు తీసుకుంది. శనివారం సాయంత్రం వైకుంఠపుర దేవస్థానం సమీపంలో తన బాబు పూల కొట్టు వద్ద కూర్చుని ఉన్న ఆమె వద్దకు మాజీ భర్త సామేలు వచ్చి మాట్లాడాలంటూ రమ్మన్నాడు. దానికి ఆమె నిరాకరించడంతో బలవంతంగా కొంతదూరం లాక్కువెళ్లి తనతో పాటు తెచ్చుకున్న చాకుతో ఆమె వీపు భాగంలో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఆమె కేకలు విన్న బాబాయి అక్కడి వారు రావడంతో నిందితుడు పరారయ్యాడు. క్షతగాత్రురాల్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### శ్రీహరి నామ సంకీర్తన బృందం గానాలాపన

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని రుక్మిణీసమేత గోవర్ధన స్వామి, ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీహరినామ సంకీర్తన బృందం శనివారం సాయంత్రం సంకీర్తన గానం చేశారు. గురువు పెరవలి వంశీకృష్ణ, అండె బాలచంద్రమౌళి, అండె రాజేశ్వరి, తన్మయి, మాదల నాగ అర్చన, రూపశ్రీ, కొత్తమాసు పుష్పలత, దంటు శర్వాణి, విష్ణు ప్రియ, వేమవరపు లక్ష్మీ నరసింహారావు, సాములూరి శివశంకరరాజు, టీటీఎస్ శాస్త్రి సంకీర్తనలను గానం చేశారు.

# విపరీతమవుతున్న వీధి కుక్కల బెడద

- పాదచారులు, వాహనదారులపై దాడులు
- దీనికి తోడు వాటికి మాంగే అనే చర్మ వ్యాధి
- మృత్యువాత పడుతున్న శునకాలతో ఆందోళన





వ్యాధితో బాధపడుతున్న కుక్కలు

తాడేపల్లిరూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా కుక్కలు ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగు పెట్టిస్తున్నాయి. రాత్రిళ్లు వాహనదారులు, పాదచారులపై దాడులు చేస్తున్నాయి. దీనికి తోడు వీధి కుక్కలు వింత చర్మ వ్యాధితో బాధపడుతున్నాయి. వాహనాల వెంట పడుతూ..భయాందోళనకు స్థానికులను గురిచేస్తున్నాయి. ఈ వైరస్ వల్ల కుక్కలకు చర్మంపైన ఉన్న వెంట్రుకలు రాలిపోతున్నాయి. తర్వాత తోలు ఊడిపోతోంది. తరువాత ఆ కుక్క వింత చేష్టలతో చనిపోతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే ఈ కుక్కలు మనుషులను కరిస్తే ప్రమాదం జరుగుతుందని, ఈ వ్యాధి ప్రజలకు సోకి ప్రజలు కూడా ఇబ్బందులు పడతారని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అయితే ఇది మాంగే అనే చర్మ వ్యాధి అంటూ వైద్యులు చెబుతున్నారు. ఇంట్లో పెంచుకునే కుక్కలతో పాటు వీధి కుక్కలకు మేంజి అనే వైరస్ వస్తోందని చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన కుక్కల చర్మంపై ఉన్న వెంట్రుకలు ఊడిపోతాయి. అనంతరం చర్మంపై పుండ్లు ఏర్పడి మృత్యువాత చెందుతాయి. పుండ్లు పడిన సమయంలో కుక్కలు వింతగా ప్రవర్తిస్తాయి.

### కుక్కలు వెంట పడుతున్నాయి



పోలకంపాడు మూడు బొమ్మల సెంటర్ నుంచి శివాలయం వరకు విపరీతంగా కుక్కలు ఉన్నాయి. వాటిలో కొన్ని కుక్కలకు విచిత్రమైన వ్యాధి సోకింది. అవి రోడ్డుపైనే పడుకుంటున్నాయి. ఒక్కసారిగా పిచ్చి పట్టినట్లు పైకిలేచి ద్విచక్రవాహనాల వెంబడి పడుతున్నాయి. ఇలా పడిన సమయంలో ఇద్దరు ముగ్గురు బండి అదుపుతప్పి కింద పడి గాయపడ్డారు. ఆ కుక్కలను చూస్తుంటే భయమేస్తోంది.

– శ్రీను, పోలకంపాడు

### నియంత్రణకు ప్రత్యేక చర్యలు



మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వీధి కుక్కలను నివారించేందుకు కాజలో యాంటీ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పశువైద్యులతో కలసి వాటికి టీకాలు వేయిస్తున్నాం. సంతాన ఉత్పత్తి జరగకుండా ఉండేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నాం. త్వరలోనే వీధి కుక్కల సమస్యలేకుండా పరిష్కరిస్తాం.

– అలీమ్ బాషా, కమిషనర్, ఎంటీఎంసీ

### భయాందోళనొద్దు



మాంగే వైరస్ వ్యాధి సోకిన కుక్కలు తమను తాము కాపాడుకోవడానికి ప్రయతి్నస్తాయి. ప్రజల జోలికి వెళ్లవు. ఒక వేళ పొరపాటు ఆ వ్యాధి సోకిన కుక్క కరిస్తే వైద్యులను సంప్రదించి, వైద్యం చేయించుకుంటే సరిపోతుంది. ఈ వైరస్‌ను నివారించాలంటే ఆ కుక్కకు కొన్ని రకాల ఇంజక్షన్లు చేయాల్సి ఉంది. ఎవరైనా ప్రభుత్వ పశు వైద్యశాలకు అలాంటి వ్యాధి సోకిన కుక్కలను తీసుకువస్తే వైద్యం చేస్తున్నాం.

– నరేంద్రరెడ్డి, తాడేపల్లి పశువైద్యాధికారి

# సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



మాట్లాడుతున్న సమన్వయకర్త వేమారెడ్డి

మంగళగిరి: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు తాను అండగా ఉంటానని మంగళగిరి నియోజకవర్గ ఆ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్టులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా యాక్టివిస్టులు, కార్యకర్తలు రాజకీయంగా మాత్రమే పోస్టులు పెట్టాలని వ్యక్తిగత దూషణలొద్దని తేల్చి చెప్పారు. తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరుకోబోమని, ఎంత దూరమైనా వెళ్తామని స్పష్టం చేశారు. చరిత్రలో ఇలాంటి దుర్మార్గపు పాలన చూడలేదని, కూటమి ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆరు నెలల కాలంలోనే ప్రభుత్వంపై ఇంతటి వ్యతిరేకత గత ప్రభుత్వాలపై ఎన్నడూ రాలేదన్నారు. ఎన్నికల సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేక, ప్రజలు నిలదీస్తారనే భయంతో వారి పక్కదోవ పట్టించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు కేసులకు కార్యకర్తలు భయపడవద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవంతంగా భూ సమీకరణ

రిటర్నబుల్ ప్లాట్‌లకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ కేంద్రాలు



ప్లాటు పత్రాలు అందజేస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ నవీన్

తాడికొండ: అమరావతి నిర్మాణం కోసం రైతులు స్వచ్ఛందంగా తమ భూములను ఏపీ రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ)కు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారని, ఇది శుభపరిణామమని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అన్నారు. గతంలో రిటర్నబుల్ ప్లాట్లు అందుకోని వారికి విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో శనివారం లాటరీ నిర్వహించారు. రాజధాని రైతుల సహకారంతోనే ప్రజా రాజధాని సాధ్యపడుతుందని ఏసీ అన్నారు. ప్లాట్లు పొందిన రైతులకు అమరావతిలో ప్రభుత్వం 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల్లోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. దశలవారీగా రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కృష్ణాయపాలెం, నవులూరు 1-2, బోరుపాలెం, నెక్కల్లు, తుళ్ళూరు 1-2, వెలగపూడి, మందడం 1-2, నిడమర్రు 1-2, అనంతవరం గ్రామాలకు చెందిన 37 మంది రైతులకు 120 నివాస, 49 వాణిజ్య ప్లాట్లను అందజేశారు. ఏపీ సీఆర్డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ఎస్ రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్ రాజు, జి.భీమారావు, పద్మావతి, రవీంద్ర, గుంటూరు కలెక్టరేట్ ఏపీడీసీ లక్ష్మీ కుమారి, తహసీల్దారు అరుణాదేవి పాల్గొన్నారు.

# అందుబాటులో ఓటర్ల జాబితా ముసాయిదా



సవరణ ప్రక్రియలో బీఎల్వోలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధితో పాటు దుగ్గిరాల మండల పరిధిలో ప్రతి బూత్‌లోను ఓటర్ల జాబితా మార్పులు చేర్పులతోపాటు కొత్తగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ముసాయిదా జాబితా-2025ను ఓటర్లకు అందుబాటులో ఉంచి, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటర్లు కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త ఓటు నమోదు, మరణించిన వారి ఓట్లు తొలగించుకోవడం వంటివి చేపట్టారు. సీకే బాలిక హైస్కూల్‌లో బూత్ నెంబర్ 163 నుంచి 169 వరకు బూత్ లెవల్ అధికారులు ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితా 2025 అందుబాటులో ఉంచి జాబితాలో మార్పులు, చేర్పులు ప్రక్రియను చేపట్టారు. ఆదివారం కూడా ప్రతి బూత్‌లో ఈ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. బీఎల్ఓలు పి. భాస్కరరావు, మణికంఠ, కె.నాగమణి, భవ్య, సమత, ధరణి, డి.చంద్రిక పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం


మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మంగళగిరి రూరల్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డివిఆర్) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

### పంటల బీమాపై అవగాహన



క్రోసూరు: రబీలో పంటల బీమా నమోదుపై రైతు సేవా కేంద్ర సిబ్బందికి అవగాహన కార్యక్రమం వ్యవసాయ కార్యాలయంలో ఏవో వేణుగోపాల్ శనివారం నిర్వహించారు. వరి పంటకు ఎకరాకు రూ. 630 ప్రీమియం రైతు చెల్లించి, బీమా చేయించుకోవాలన్నారు. తుది గడువు డిసెంబర్ 31 అని వెల్లడించారు. ఈ-పంట నమోదుకు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కో-ఆర్డినేటర్ గోపి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొనడం జరిగింది.

### కొండచిలువ హల్‌చల్



తాడేపల్లిరూరల్ : మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిలో శనివారం రాత్రి ఓ కొండ చిలువ రోడ్డుపైకి వచ్చింది. అది గమనించిన ప్రయాణికులు వాహనాలు ఆపి కొండ చిలువను వెంబడించారు. దీంతో కొండచిలువ ఒక్కసారిగా జనాల మీదకు వచ్చేందుకు ప్రయత్నించింది. తాడేపల్లి ప్రెస్‌క్లబ్, తహసీల్దారు కార్యాలయం ఆవరణలో సంచరిస్తుండగా.. నులకపేట విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది బాబు సుభాని డచిలువ పట్టుకున్నాడు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మంగళగిరి ఏరియా సిబ్బంది కొండ చిలువను స్వాధీనం చేసుకున్నారు. కొండచిలువ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి కొండ ప్రాంతాల్లో వదలనున్నట్లు బీట్ ఆఫీసర్ సతీష్‌కుమార్ తెలిపారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచనలో విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : పెదవడ్లపూడి గ్రామంలోని నాగార్జున హైస్కూల్ విద్యార్థులకు శనివారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, వక్తృత్వ, నాటిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ వ్యవసాయ కళాశాల విభాగాధిపతి డాక్టర్ బి. బాలకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోని అతి పెద్ద రాజ్యాంగం రూపకల్పనలో కీలక పాత్ర పోసించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయమన్నారు. డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్ మాట్లాడుతూ సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక గణతంత్రానికి పునాది వేసిన రాజ్యాంగ సభ దార్శనికతను గౌరవించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ పి. సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించగా వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖరరావు, డీన్‌లు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షేక్ సమీర్, కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన ఎంఈవో



పాఠశాల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిరూరల్: స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్లో శుక్రవారం సాయంత్రం విద్యార్థి గాయపడడిన నేపథ్యంలో పాఠశాలను ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ శనివారం పరిశీలించారు. పట్టణంలో ప్రముఖ ఆర్కెస్ట్రా మ్యూజికల్ బ్యాండ్ ఇన్‌స్ట్రుమెంట్స్ తయారీదారులుగా ఉన్న ఎస్‌కే మహబూబ్ సుభానీ, షర్మిల దంపతుల కుమారుడైన ఎస్‌కే మిరాజ్ కెకెఆర్ గౌతమ్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం 5.00 గంటల సమయంలో క్లాసులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు స్కూల్ కాంపౌండ్‌లోని సైకిల్ స్టాండ్ వద్ద తన సైకిల్ తీసుకుంటుండగా ఐదో అంతస్తు నుండి కిటికీ ఊడి విద్యార్థి మిరాజ్ మీద పడింది. కిటికీకి ఉన్న గాజు విద్యార్థి తలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని చెబుతున్నారు. అయితే ఈ ఘటన గురించి తెలుసుకున్న ఎంఈవో లక్ష్మీనారాయణ పాఠశాలను సందర్శించి అక్కడ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి అతడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని ధైర్యం చెప్పారు. స్కూల్‌లో ప్రమాదకరంగా ఉన్న కిటికీలు అన్నీ తొలగించాలని యాజమాన్యాన్ని ఎంఈవో ఆదేశించారు. ఘటన గురించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇది చాలా బాధాకరమైన ఘటన అని స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థి కోలుకునే వరకూ వైద్యానికి అయ్యే ఖర్చును స్కూల్ యాజమాన్యమే భరిస్తుందని వారు చెప్పడం జరిగిందన్నారు. ఈ ఒక్క స్కూల్ మాత్రమే కాకుండా అన్ని ప్రైవేటు పాఠశాలలు భద్రతా ప్రమాణాలు పాటించాలని లేదంటే తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు.

# తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి

తెనాలిరూరల్: ధాన్యం కొనుగోలుకు రైతు సేవా కేంద్రాలకు వచ్చే రైతుల పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎటువంటి తప్పులకు తావు లేకుండా జాగ్రత్త పడాలని వ్యవసాయాధికారులు సూచించారు. తెనాలి పట్టణ, మండలం, చేబ్రోలు మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, జీడీసీఎంఎస్ సిబ్బందికి శనివారం సాయంత్రం తెనాలి మార్కెట్ యార్డులో అవగాహన సదస్సును నిర్వహించారు. వ్యవసాయశాఖ, సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెనాలి మండల వ్యవసాయ అధికారి జి. ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేయించుకున్న రైతులందరూ ఆయా రైతు సేవా కేంద్రాలలోని వివరాలతో ధాన్యం కొనుగోలు యార్డులో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చేబ్రోలు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర 75 కిలోలకు గ్రేడ్-ఏ రకానికి రూ.1740 లు ఉందని, ఈ అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకోవలసినదిగా కోరినారు. జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాలరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పాటించవలసిన నియమాలు, నాణ్యత ప్రమాణాలు గురించి వివరించారు. ఏడీఏ ఎన్. ఉషారాణి పర్యవేక్షించారు.

# త్రుటిలో తప్పిన పెను రోడ్డు ప్రమాదం

- ద్విచక్ర వాహనాలపై నుంచి దూసుకెళ్లిన లారీ
- విరిగిన రెండు విద్యుత్ స్తంభాలు



స్తంభాన్ని ఢీకొట్టి ఆగిన లారీ

ఫిరంగిపురం: వేగంగా వచ్చిన ఓ లారీ బీభత్సం సృష్టించింది. రెండు ద్విచక్ర వాహనాలపై నుంచి దూసుకెళ్లి రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొంది. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న లారీ వేగంగా వస్తూ ఓ మందుల దుకాణం ఎదురుగా ఉన్న బైకుల మీదుగా దూసుకెళ్లింది. రెండు విద్యుత్ స్తంభాలను బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. సమీపంలో ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. స్తంభం విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తక్షణమే సిబ్బంది స్పందించి పోల్స్‌ను ఏర్పాటు చేసి, సరఫరాను పునరుద్ధరించారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దెబ్బతిన్న మోటారు సైకిళ్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

### 26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తాడేపల్లిరూరల్ : అమరావతి డివిజన్ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, అమరావతి, తాడికొండ, పెదకూరపాడు ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార వేదిక, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న మంగళవారం మంగళగిరి పట్టణ పరిధిలోని సి.ఎస్.ఆర్. కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ వేదిక ద్వారా వినియోగదారులు విద్యుత్ బిల్లుల లోపాలు, వోల్టేజ్ హెచ్చు తగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగల మరమ్మతులు, మీటర్ లోపాలు, సరఫరా అంతరాయం మొదలైన అన్ని విద్యుత్ సమస్యలను అధికారులకు తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమం సీజీఆర్ఎఫ్ విజయవాడ చైర్ పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ (రిటైర్డ్ జడ్జి) అధ్యక్షత నిర్వహించనున్నామని, ఫోరం సభ్యులు కె.వెంకట కృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

### వార్డుల్లో ఆక్రమణలు తొలగించాలి

తెనాలిరూరల్: పట్టణంలోని 17, 19 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శనివారం పర్యటించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులతో కలిసి ఆయా వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్డు మీద ఉన్న ఆక్రమణలను తొలగింపజేశారు. ప్రజలందరూ పురపాలక సంఘానికి సహకరించాలని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. ఆక్రమణలు చేయడం స్థానికులకు ఇబ్బందులు కలిగించడం చేయవద్దని చెప్పారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ మరింతగా మెరుగు పరిచే విధంగా మున్సిపాలిటీ నుంచి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



### వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఎన్‌సీసీ విద్యార్థులు



తెనాలి: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా 22 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సూచనపై స్థానిక శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవా శాంతి ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులను పలకరించి, పండ్లు పంపిణీ చేశారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు చిలకా సుందరరావు ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సేవాభావం, పెద్దలపట్ల గౌరవం పెరుగుతాయని, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్ చెప్పారు. 22 ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ జూనియర్ కమిషన్ ఆఫీసర్ అవతార్ సింగ్ పర్యవేక్షించారు.

### ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Patamata Branch, VIA వారి సంబంధించి పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, వెల్లటూరు కాపురస్తులు యర్రా (లేటు) నాగేశ్వరరావు గారి కుమార్తె యర్రా విజయలక్ష్మి గారు దఖలు దస్తావేజు నెం.1731/2020 (యస్.ఆర్.ఒ.-మైలవరం) ద్వారా పొందిన ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మార్టిగేజ్ చేసుకొని యర్రా విజయలక్ష్మి గారి పేరు మీద లోను పొందనున్నారు. [illegible] 7 రోజులలో Regd. Post with Ack Due ద్వారా తెలియజేయగలరు. [illegible]

షెడ్యూలు: ఎన్టీఆర్ జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా, జి.కొండూరు మండలం, జి.కొండూరు గ్రామ పంచాయతి ఏరియాలో చేరిన జి.కొండూరు గ్రామ ఆర్.సర్వే నెం. 296/1ఎ, దాఖలా ప్లాటు నెం. 14కు దాఖలా చ.గ.లు 240 [illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., Vijayawada. ✆ 9849431432

### ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Patamata Branch, VJA వారి సంబంధించి పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు మండలం, నడిం తిరువూరు కాపురస్తులు కంచి రామారావు గారి కుమారుడు కంచి రఘుప్రదీప్ గారు దఖలు దస్తావేజు నెం.2127/2002 (యస్.ఆర్.ఒ.-తిరువూరు) ద్వారా పొందిన ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మార్టిగేజ్ చేసుకొని కంచి రఘుప్రదీప్ గారి పేరు మీద లోను పొందనున్నారు. [illegible] 7 రోజులలో Regd. Post with Ack Due ద్వారా తెలియజేయగలరు. [illegible]

షెడ్యూలు: ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు సబ్.డి., తిరువూరు మం., తిరువూరు గ్రామ పంచాయతి ఇలాకా, నడిం తిరువూరు గ్రామ ఆర్.యస్. నెం. 249/2కు దాఖలా, డో.నెం. 16/99కు దాఖలా చ.గ.లు 1742.40లు [illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., Vijayawada. ✆ 9849431432